మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## ఓటరు నమోదుకు చేసుకున్న దరఖాస్తులన్నింటిని త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** ఓటరు నమోదుకు చేసుకున్న దరఖాస్తులన్నింటిని త్వరగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. వనపర్తి జిల్లాలో కొత్తగా ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు, తొలగింపుకు ఫారం 7, మార్పు చేర్పులు ఫారం, 8 లను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల ఎలక్టరోల్ ఆఫీసర్ వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి జిల్లాలో ఫారం 6,7,8 ల పెండెన్సి, పరిష్కారం, జనవరి 20,21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్ ఏర్పాటు పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి వివరిస్తూ తుది ఓటరు జాబితా ముద్రణకు ముందు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. డూప్లికేట్ ఓట్లను గుర్తించి ఓటరు జాబితా, నుండి తొలగించాలని సూచించారు. జనవరి 20,21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్ ఏర్పాటు పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి వివరిస్తూ తుది ఓటరు జాబితా ముద్రణకు ముందు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. డూప్లికేట్ ఓట్లను గుర్తించి ఓటరు జాబితా నుండి తొలగించాలని సూచించారు. జనవరి 20,21 తేదీలలో నిర్వహించే ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెయిన్ ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లడుతూ వనపర్తి జిల్లాలో ఫారం 6,7,8 లు దాదాపు 20,569 వచ్చాయని వాటిని క్షేత్రస్థాయిలో బిఎల్ఒల ద్వారా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ పై ఇప్పటికే మీడియా ద్వారా పలుమార్లు ప్రచారం నిర్వహించడం జరిగిందని, ప్రత్యేక క్యాంపెయిన్ పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్లు రమేశ్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డేకు ఏర్పాట్లు చేయండి..

### ఉత్తమ సేవలకు అవార్డులు అందించాలి..సమీక్ష నిర్వహించిన కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 19 ప్రభాతవార్త :** ఈ సంవత్సరపు రిపబ్లిక్ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల విషయమై శుక్రవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. గత సంవత్సరం సైతం పోలీస్ పరేడ్, జాతీయ పతాకావిష్కరణ, స్వతంత్ర సమరయోధులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహూకరణ వంటి కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని, ఇందుకుగాను ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ముఖ్య అతిథులకు, ప్రజాప్రతినిధులు, మీడియా తదితరులకు అవసరమైన ఆసనాల ఏర్పాటుతో పాటు, ప్రజలకు త్రాగునీరు, టెంట్లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథి సందేశానికి ఈనెల 22లోగా శాఖలు వారి శాఖలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికను ముఖ్య ప్రణాళిక అధికారికి సమర్పించాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఆయా శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా స్టాల్స్ ఏర్పాటుతోపాటు, శకటాలను రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంసా పత్రాలను ముందుగానే సిబ్బంది పేర్లను పంపించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీరు, పూలతో అలంకరణ వంటివన్నీ ముందుగానే ఆయా శాఖల అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. మొత్తం కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డిఆర్ఓ కెవివి రవికుమార్, జిల్లా అధికారులు సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

## 20,21తేదీలలో ప్రత్యేక ఓటరు శిబిరం..

### జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త :** ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 20,21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు సవరణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 8, 2024 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో 2024ను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని 18 సంవత్సరాలు వయస్సుకు జనవరి 1,2024ను అర్హత తేదీగా నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఈనెల 20,21 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై ప్రజలందరికి తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే చర్యలు తీసుకోవడంతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6,7,8 దరఖాస్తు ఫారములు బూత్‌స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## అంగులం సైజులో అయోధ్య రామాలయం..

### - 48గంటల దీక్ష చేపట్టి రూపకల్పన - పెన్సిల్ లిడ్స్‌తో తయారు చేసిన సంతోశ్ చారి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19, ప్రభాతవార్త :** రాములోరికి ఉడుతభక్తిగా పెన్సిల్ లిడ్స్‌తో అయోధ్య రామాలయాన్ని తయారు చేసి తన ప్రతిభను చాటాడు జడ్చర్లకు చెందిన సంతోశ్‌చారి. ఈనెల22న అయోధ్యలో రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనున్న నేపథ్యంలో దీక్షబూని 48గంటల్లో అగులం సైజులో రామమందిరం తయారు చేశాడు. పెన్సిల్ లిడ్స్‌ను ఉపయోగించి 1అంగులం పొడవు,1.5 అంగులం వెడల్పులో రామమందిరాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో తయారు చేసి తన ప్రతిభను మరో సారి నిరూపించుకున్నాడు. కోట్లాది మంది భారతీయుల కల, రామమందిరం నిర్మాణం, బాలరా ముడి ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంలో తాను మైక్రో రామ మందిరం తయారు చేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గతంలోనూ సంతోశాచారి అరచేతిలో యాదాద్రి ఆలయం, బియ్యం గింజ సైజులో స్వర్ణ గణపతి, బొటనవేలు గోరుపై బంగారు భారత్ లాంటి విగ్రహాలను తయారు చేసి అందరినీ అబ్బురపర్చాడు. మైక్రో ఆర్టిస్టుగా ప్రతిభను చాటుతూ అందరి దృష్టిని మరల్చుతున్నాడు.



అంగులం సైజులో ఏర్పాటు చేసిన రామమందిరం

**నా అదృష్టంగా భావిస్తున్నా..** ఈనెల 22 దేశ చరిత్రలోనే కాదు ప్రపంచ చరిత్రలో భారతదేశ ఖ్యాతి ఎప్పటికీ నిలిచిపోతుంది. కోట్లాది భారతీయు, హిందూ బంధువుల ఆరాధ్య దైవం రాములవారి ఆలయం నిర్మాణం, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను చూసే భాగ్యం కలుగడం సంతోషంగా ఉంది. విశ్వ హిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడిగా, రామ మందిరం నిర్మాణం కోసం నిధి సేకరణ రామ మందిరం తయారు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. భవిష్యత్తులో మరిన్ని విగ్రహాలు, ఆకారాలు రూపొందిస్తా. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కూడా ఇస్తాను.



**- సంతోశ్‌చారి, జడ్చర్ల, మైక్రో ఆర్టిస్ట్**

# మాజీలకు పవర్ కట్..!

- సిట్టింగులకూ నో చాన్స్..
- ఓడిన ఎమ్మెల్యేల స్థానంలో ఎమ్మెల్సీలకు ఇన్‌చార్జి
- నియోజకవర్గాల వారీగా ఎన్నికల బాధ్యతలు
- పార్లమెంట్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్
- ఓడిన వారు ప్రచారానికి వెళ్తే ఇబ్బంది అని ఆలోచన
- దిశా నిర్దేశం చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- త్వరలోనే గులాబీ బాస్ కేసీఆర్ సమావేశం



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19, ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్ పెంచింది. అయితే ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ ఎంపీలకు కూడా తిరిగి మళ్లీ టికెట్ కేటాయించే అవకాశాలు దాదాపు లేనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి పాలమూరులో 14అసెంబ్లీ స్థానాలకు 12స్థానాల్లో ఓటమి పాలుకావడంతో మరోసారి ఇలా జరగకుండా ఉండేలా ముందు నుంచే ఆచితూచి అడుగులు వేస్తున్నది. ఓడిన నియోజవర్గాల్లో ఎన్నికల బాధ్యతలను ఎమ్మెల్సీకు ఇవ్వాలని నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తీవ్ర వ్యతిరేఖత ఉన్న స్థానాల్లో మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో ఉండకుండా చూసుకుంటున్నారు. ఓడిన వారు మళ్లీ ప్రచారంలో పాల్గొంటే జనాల నుంచి వ్యతిరేఖత వస్తుందని భావించి మాజీలను పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచనున్నారు. ఈమేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతలకు,నాయకులకు దిశానిర్దేశం చేశారు. అయితే త్వరలోనే గులాబీ బాస్ కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికలపై సమావేశం నిర్వహించి పర్యటించనున్నట్లు సమాచారం.

**రెండు పార్లమెంట్ స్థానాలు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అందులో మహబూబ్‌నగర్ జనరల్ స్థానం కాగా, నాగర్‌కర్నూల్ సెగ్మెంట్ ఎస్సీ రిజర్వ్‌డ్. అయితే ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీలుగా ఉన్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి రాములుకు మళ్లీ టికెట్ అవకాశాలు లేనట్లు సమాచారం. రెండు స్థానాల్లో దాదాపు కొత్తవారికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది.

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 2009లో మందా జగన్నాథం, 2014లో తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి నంది ఎల్లయ్య గెలుపొందగా టీఆర్ఎస్ నుంచి మందా జగన్నాథం రెండో స్థానంలో నిలిచారు. 2019లో టీఆర్ఎస్ నుంచి పోతుగంటి రాములు గెలువగా రెండో స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి నిలిచారు.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 2009లో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గెలిచి చరిత్ర సృష్టించారు. ఉద్యమ నేతగా, పాలమూరు ఎంపీగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తదనంతరం 2014లో తిరిగి టీఆర్ఎస్ నుంచి జితేందర్‌రెడ్డి గెలుపొందారు. 2019లోనూ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఎంపీగా గెలిచారు. వరుసగా మూడు సార్లు గెలుపొంది టీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించింది.

**ఓడిన వారు ప్రచారానికి దూరం..**

ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓడిన వారిని పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. వారితో పాటు వ్యతిరేఖత ఎక్కువగా ఉన్న సెగ్మెంట్లలోనే సరిదిద్దే చర్యలు తీసుకుంటున్నారు. అయితే వ్యతిరేఖతతో ఓడిన వారు మళ్లీ ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వ్యతిరేఖత పెరుగుతుందనే భావనతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఓడిపోయిన వారి స్థానంలో ఎమ్మెల్సీలకు పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి గ్రామం వారీగా మండలాలు,నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది.

**పాలమూరులో హ్యాట్రిక్..**

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో వరుసగా మూడుసార్లు కారు గుర్తే గెలిచింది. మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధక్యంలో ఉంటుందని చెప్పడానికి ఇదే నిదర్శనం. అయితే మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఇందుకు భిన్నంగా మూడు స్థానాల్లో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్రలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి క్లీన్ స్వీప్ చేశారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వేవ్ కొనసాగుతుందా..బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందా వేచి చూడాల్సిందే..

## ప్రజలు తిరస్కరించినా
# అహంకారం తగ్గలే..

- 9కోట్ల మంది ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ఉచిత ప్రయాణం ఇష్టం లేకుంటే టికెట్ కొనొచ్చు..
- రాముడి ఫోటోతో బీజేపీ రాజకీయం.
- ప్రతిపక్షాలు కొంత ఓపికపట్టాలి..
- అధికారం చేపట్టి 45రోజులు దాటలే..
- రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19, ప్రభాతవార్త :** పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఎలా కొల్లగొట్టిందో శాసన సభ వేదికగా చెబుతుంటే అది తట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా హామీలను అమలు చేయడం లేదని, కక్ష రాజకీయాలు చేస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందని, తాము అధికారంలోకి వచ్చి 45రోజులు కూడా గడవలేదని ఇచ్చిన ప్రతి హామీని తప్పక అమలు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కొల్లూరులోని చింతలపురి చిన్మయ స్వామి మఠం ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఒక్క పథకం తీసుకురాలేదని, కానీ హరీశ్‌రావు ప్రస్తుతం ఆటో కార్మికులను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. శ్వేతపత్రాన్ని స్వేద పత్రం పేరున విడుదల చేశారని, వాళ్లేమన్న చమటోడ్చి కట్టారా తెలంగాణ ప్రజల సొమ్మే కదా, ప్రభుత్వ సొమ్మే కదా స్పష్టం చేశారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో, ఏం ప్రాజెక్టులు పూర్తి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలతోని తిరస్కరించబడ్డ తర్వాత కూడా ఇంకా అహంకారంగా మాట్లాడడం బీఆర్ఎస్ నాయకులకే చెల్లుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాండ్, ల్యాండ్, మైనింగ్ మాఫియా పేరుతో కోట్లు సంపాదించారని బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేయాలని ప్రతి సొమ్మును కక్కిస్తామ న్నానరు. ప్రతిపక్షాలు ఓపిక పట్టాలని చెప్పారు. కొందరు మహిళల ఉచిత ప్రయాణం వొద్దని కోర్టును ఆశ్రయించారని ఉచిత ప్రయాణం ఇష్టంలేని వారు టికెట్ తీసుకొని ప్రయాణం కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే 9కోట్ల మంది మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచిత ప్రయాణం చేశారని వెల్లడించారు. ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను సైతం ప్రభుత్వమే సరఫరా చేసి గ్రామ, వార్డు స్థాయిలో దరఖాస్తులు స్వీకరించిందని, మొత్తం కోటీ 5లక్షల దరఖాస్తులు వచ్చాయని, అవి కాకుండా ఇతర అంశాలపై మరో 20లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటి డేటా ఎంట్రీ కూడా పూర్తయిందన్నారు. డ్రగ్స్‌పై రేవంత్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. మే నెలలో వెయ్యి కొత్త బస్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఆర్టీసీ ఆస్తులు ఎక్కడ దుర్వినియోగం అయిందో వాటిని ఆధీనపర్చుకుంటామన్నారు. బీజేపీ నాయకులు రాముడి ఫోటోతో రాజకీయం చేయడం కాదని రాష్ట్ర ప్రజలకు కోసం ఏం చేశారో చెప్పాలని బీజేపీ నేతలను డిమాండ్ చేశారు. రామాలయం నిర్మాణం రాముని ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా జరగాలని, దేశంలోని నాలుగు ప్రధాన పీఠాధిపతులు ఇంకా రాములవారి ఆలయం నిర్మాణం పూర్తి కాలేదని చెబుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.





## పశ్చిమ కనుమల్లో కొత్త మొక్క కనుగొన్న వనపర్తి జిల్లా పీహెచ్‌డీ విద్యార్థి భరత్ సింహా

**వీపనగండ్ల జనవరి 19, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన పి.భరత్ సింహా యాదవ్ తమిళనాడు రాష్ట్రంలో మధు రైలోని మధుర కాలేజ్ లో ప్రొఫెసర్ కరుప్పుసామి ఆధ్వర్యంలో వృక్షశాస్త్రంలో పరిశోధనలు చేస్తున్నారు. ఇతను ఆ యూనివర్సిటీలో సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి దాదాపు 1600 మొక్కలపై రీసెర్చ్ చేసినట్లు ఆయన తెలిపారు. అందులో ఒక నూతన పేరు లేనటువంటి మొక్కను ఆయన కనుగొన్నట్లు తెలిపారు. ఆ మొక్కకే అండ్రో గ్రాఫిస్ థెనియన్సిస్ అని పేరు పెట్టారు. దాంతో పాటు ఇంకో మొక్కను కూడా పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు. అయితే దానికి ఇంకా పేరు నామకరణం కాలేదని తెలిపారు. దాని పేరు కూడా మేఘా లయన్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. అయితే ఇంకా అది పూర్తిగా రీసెర్చ్ కాలేదని ఆయన అన్నారు. ఇదే కాక మొట్టమొదటక తెలంగాణ లో పాముల మీద కూడా రీసెర్చ్ చేసినట్లు ఆయన తెలిపారు. పాముల ను పట్టుకునే విధానం ఎన్ని రకాల పాములు ఉన్నవి వాటి యొక్క పూర్తి విశేషాలు ఏమిటి అనే దాని పైన కూడా మొదటగా రీసెర్చ్ చేసిం ట్లు ఆయన తెలిపారు. భరత్ పశ్చిమ కనుమల్లోని అంతరించిపోతున్న మొక్కల జీవిత చక్రం అనే అంశంపై పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగానే తమిళనాడులోని జిల్లాలో ఒక కొత్త మొక్కను కనుగొన్నారు. ఈ మొక్కకు అండ్రో గ్రాఫిస్ థెనియేన్సిస్ అని నామకరణం చేశారు. సాధారణంగా అండ్రో గ్రాఫిస్ ప్రజాతికి చెందిన మొక్కలు బంగ్లాదేశ్ , భారతదేశం, మయాన్మార్, నేపాల్, శ్రీలంక, పశ్చిమ హిమలయాలలో విస్తరించి ఉంటాయి. అంతేకాక అంతరించిపోతున్న మొక్కల జీవిత చక్రం అనే అంశం మీద రీసెర్చ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.





## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు..

### ఇసుక కాలాల్సిన వారు అనుమతి తప్పనిసరి

### తుంగభద్ర నదితీర గ్రామాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రితిరాజ్



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రితిరాజ్, పోలీసు సిబ్బంది

**అలంపూర్ జనవరి 19 ప్రభాతవార్త:** జిల్లాలో తుంగభద్ర నది నుండి ఇసుక అక్రమ రవాణాకు ఏలాంటి అస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఇసుక అవసరం అయిన వారు ఆన్‌లైన్ లో అనుమతి తీసుకుని ఇసుక రీచ్ ల ద్వారా మాత్రమే తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ తుంగభద్ర నది తీర గ్రామాలు అయిన తూర్పు గార్లపాడు, తుమ్మిళ్ల, చిన్న దన్వాడ, పెద్ద దన్వాడ వేణి సొంపురం గ్రామాలలో నిల్వ ఉంచిన ఇసుక డంప్ రిచ్‌లను సందర్శిఇంచి ఆన్‌లైన్‌లలో ఇసుక అనుమతులు పొంది ఇసుక రీచ్‌ల నుండి ఇసుకకు తీసుకెళ్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తుంగభద్ర నది తీర గ్రామాలలో గుర్తించిన ప్రదేశాలలో ఉన్న ఇసుక డంప్ రీచ్‌ల నుండి ఆన్‌లైన్‌లలో బుకింగ్ చేసుకున్న విధానం ప్రకారం వాహనాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుంది. అని, అనుమతి లేని వాహనాల నుండి అక్రమంగా ఎట్టి పరిస్థితుల్లోను ఇసుక అక్రమంగా తరలకుండా గట్టి చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు, మైనింగ్ అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఇసుక అవసరం అయిన వాళ్ళ అన్‌లైన్ ద్వారా అనుమతి పొంది ఇసుక తీసుకెళ్లాలని సూచించారు. ఇసుక రీచ్‌ల దగ్గర నిరంతరం సంబంధిత శాఖ అధికారులు కాపలా ఉండాలని, అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని మైనింగ్ అధికారులకు సూచించారు. నది తీర ప్రాంతంలో, ఇసుక రీచ్ లు ఉన్న ప్రాంతంలో బ్లూ కోల్ట్స్ , పెట్రో కార్స్ సిబ్బందితో మరింత నిఘా పెంచాలని అలాగే అక్రమ ఇసుక రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టాలని ఎస్సైలకు సూచించారు. గ్రామస్థులతో ఎస్పీ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం వస్తే సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ వెంకటేశ్వర్లు , శాంతినగర్ సిఐ శివ శంకర్, రాజోలి ఎస్సై పోలీసు సిబ్బంది ఉన్నారు.

# వికసిత్ భారత్ ప్రధాని మోడీతోనే సాధ్యం..

### దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త శిఖరాలకు చేరింది కేంద్ర మంత్రి డా. మహేంద్రనాథ్ పాండే




వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో మాట్లాడుతున్న మహేంద్రనాథ్ పాండే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహేంద్రనాథ్‌పాండే

**బిజినేపల్లి,జనవరి 19 ప్రభాతవార్త :** గత పదేళ్ల తమ పరిపాలన ప్రజల్లో తమ ప్రభుత్వంపై అంతులేని విశ్వాసాన్ని పెంచిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా. మహేంద్రనాథ్ పాండే అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా శుక్రవారం సల్కర్‌పేట గ్రామంలో వివిధ ప్రభుత్వ పథకాల లబ్దిదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధికై అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ ఎయిమ్స్ లాంటి అత్యున్నతమైన వైద్య సదుపాయాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, నిర్ణయాలతో మనదేశ ఆర్థిక వ్యవస్థ కొత్త శిఖరాలకు చేరిందని వివరించారు. ఎన్నెన్నో నూతన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రైల్వే అభివృద్ధి కోసం 17 శాతం రైల్వే విస్తీర్ణ పనులను చేపట్టి ప్రతి ఒకరికి సులభతరం చేసిందన్నారు. హైదరాబాద్ నుండి తిరుపతికి వందే భారత్ రైలును మోడీ ప్రారంభించారని, నాగర్‌కర్నూల్ జిల్లా మీదుగా త్వరలోనే రైలు తిరగనున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో హైవేల విస్తరణకై ఇప్పటి వరకు 1.2 లక్షల కోట్ల రూపాయలను జాతీయ రహదారులను నెలకొల్పిన చరిత్ర మోడీ ప్రభుత్వానిదే అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత అనే నాలుగు కులాలు సాధికారత పొందినప్పుడే సాధికార భారత్‌కు భరోసా లభిస్తుందని మంత్రి అన్నారు. మోడీ హామీ వాహనం దేశంలోని ప్రతి మారుమూల గ్రామాలకు చేరుతోందని, అధికారులు రాజకీయ నాయకులు గ్రామాల్లో దేశంలోని ప్రతి మూలకు ప్రజల ఇంటి వద్దకు వస్తారని ఎవరు అనుకున్నారని కేంద్రమంత్రి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేదల సంక్షేమం, ఆరోగ్యానికి ఒకవరం అని నిరూపిస్తుందని చెప్పారు. దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా మోదీకి గ్యారంటీపై చర్చ జరుగుతుందన్నారు. హైదరాబాద్ లాంటి మహానగరమైన,నాగర్‌కర్నూల్‌లోని చిన్న గ్రామమైనా మోదీకి గ్యారంటీ వాలీగాడి దేశంలోని ప్రతి మూలకు చేరుతుందని ఆయన అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 250 గ్రామ పంచాయతీల్లో వికసిత్ యాత్ర జరిగిందని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ యాత్ర జరగనున్నట్లు మంత్రి చెప్పారు. ప్రభుత్వ పథకాలలో సరైన లబ్దిదారులెవరూ వదిలి పెట్టకుండా చూడడమే యాత్ర యొక్క అతిపెద్ద లక్ష్యం అన్నారు. డిసెంబర్ 17వ తేదీ నుండి కొనసాగుతున్న యాత్రకు దేశంలోనే అత్యున్నతమైన స్థాయిలో ఉండే అధికారి యాత్రను పర్యవేక్షిస్తున్నారని, ఇంకోనెల అదనంగా ఈ జిల్లాలో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. మహిళలందరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఇల్లులేని లబ్దిదారులకు పక్కా ఇండ్లు నిర్మించి తీరుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణ గత కెసిఆర్ ప్రభుత్వం అమలుపరచలేదని ఇప్పుడు తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలవుతుందని అన్నారు. యాత్ర ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12 లక్షల మంది కొత్త ఉజ్వల యోజన లబ్దిదారులు ఉచిత

- మిగతా4లో..

## జర్నలిస్టు తిరుపతయ్యకు అండగా ఉంటా..

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19 ప్రభాతవార్త :** ముందుచూపు జర్నలిస్టు తిరుపతయ్యకు అండగా ఉంటానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భరోసానిచ్చారు. రెండు రోజుల క్రితం జరిగిన ఆక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడి, మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతయ్యను వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న జర్నలిస్టును శుక్రవారం నిమ్స్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్లను తిరుపతయ్య ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తిరుపతయ్యకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి కూడా తిరుపతయ్యకు కావాల్సిన ఆర్థిక సహాయం చేస్తామని జర్నలిస్టు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో యువజన క్రీడోత్సవాలు..

**ఎబివిపి రాష్ట్ర నాయకులు వినయ్‌కుమార్**




**మక్తల్, జనవరి 19 ప్రభాతవార్త :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని అచల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 21 ఆదివారం ఉదయం ప్రభుత్వ కళాశాల మైదానంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు కబడ్డి పోటీలు, బాలికలకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎబివిపి నగర కార్యదర్శి వంశీ తెలియజేశారు. క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు జనవరి 23 నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించే నేతాజీ జయంతి వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. కావున మక్తల్‌లోని పాఠశాల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎబివిపి నగర కార్యదర్శి వంశీ, వినయ్, నిచల్, రాజు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన పాత్రికేయులు



**వనపర్తి టౌన్ జనవరి 19 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో ఇటీవల సీనియర్ జర్నలిస్టు పోలిశెట్టి బాలకృష్ణ, నేటి ధాత్రి దినపత్రిక జిల్లా విలేకరి పోలిశెట్టి సురేష్‌ల మాతృమూర్తి సులోచనమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీనియర్ పాత్రికేయులు జయప్రకాశ్, బోలేమోని రమేష్, బి.లక్ష్మణ్, అంజి, అశోక్ రెడ్డి, ఈశ్వర్, రాము, ఆంజనేయులు, వై.కె.రమేష్ లు పరామర్శించారు. మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి ఎల్లవేళలా జర్నలిస్టుల తరపున అండగా ఉంటామని వెల్లడించారు.

## భూత్పూర్‌లో డ్రైడే..!!

**డ్రైన్లు, తాగునీటిని పరిశీలించిన ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్..**



**భూత్పూర్, జనవరి 19, ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా పరిగణిస్తు జిల్లా వైద్యఆరో గ్యశాఖ నిర్వహిస్తున్న డ్రైడేను పురస్కరించుకుని భూత్పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీస ర్ డాక్టర్ అబ్దుల్ రబ్ నేతృత్వంలో వైద్య ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం పలు ఆరోగ్య ఉపకేంద్రాలలో డ్రైన్లు, తాగునీటి సంప్‌లు, నీటి నిల్వ ఉంచిన ప్రాంతాలను పరిశీలించి సంబంధిత యజమానులకు తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్లు ప్రమోద్‌కుమార్, శ్రీనివాసులుతో పాటు ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టు తిరుపతయ్యకు మన్నె జీవన్‌రెడ్డి ఆర్థికసాయం

**- రూ.లక్ష అందజేసిన టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు**

**- మేమున్నామంటూ చేయూతనిచ్చిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19, ప్రభాతవార్త :** రెండు రోజుల కిందట ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించిన జర్నలిస్టులు అండగా నిలుస్తున్నారు. ప్రముఖ వ్యాపార వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ప్రమాదానికి గురైన విషయాన్ని తెలుసుకున్న జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. అధైర్యపడొద్దంటూ ఆర్థిక సాయం అందించారు. ఇదిలా ఉండగా తోటి జర్నలిస్టులు కూడా మేమున్నామంటూ ముందుకు వచ్చారు. తమకు తోచినంత ఆర్థికసాయం అందిస్తూ బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతున్నారు. సేకరించిన మొత్తానికి శనివారం కుటుంబానికి అందజేయనున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దత్తేంద్ర, రామాంజనేయులు తెలిపారు.

## రామాలయం టెంపుల్ శుద్ధి కార్యక్రమంలో

## పాల్గొన్న పట్టణ బిజెపి అధ్యక్షుడు బచ్చు రాము



**వనపర్తి టౌన్, జనవరి 19, ప్రభాతవార్త :** వనపర్తి కేంద్రంలో వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము ఆధ్వర్యంలో అయినా శ్రీ రామాలయం టెంపుల్ లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ అయోధ్య రాముని ప్రతిష్ఠ రోజు దగ్గర పడుతుంది భారతదేశ ప్రజల కల సహకారం అవుతుందని నరేంద్ర మోడీ పిలుపు ఇచ్చినారు అన్ని ఆలయాల శుద్ధి కార్యక్రమం భాగంలో భారతదేశ చిరకాల కాం క్ష రాముని అయోధ్య 22వ తారీఖు నాడు 12 గంటల ఐదు నిమిషాలకు ప్రతిష్ఠ జరుగుతుంది కాబట్టి అన్ని ఆలయాలను శుద్ధి చేయవల సిందిగా దేశ నరేంద్ర మోడీ పిలుపునివ్వడం జరిగింది. దానిలో భాగంగా వనపర్తి రామాలయం టెంపుల్ లో శుద్ధి కార్యక్రమం నిర్వహించినారు ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయిన మున్నూరు రవీందర్ నూతనంగా బిజెపి జిల్లా అధ్యక్షులు అయిన డి నారాయణ టెంపుల్ విశ్వనాథంచైర్మన్ ఆలయ కమిటీ సభ్యులైన కొండన్న జిల్లా బిజెపి ఉపాధ్యాక్షులు రామన్న వెంకటేశ్వర్ రెడ్డి నాగర్ కర్నూల్ పార్లమెంట్ కో కన్వీనర్ ప్రవీణ్ వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి సుగ్రుంం, రాయన్న సాగర్ ఓంప్రకాష్ ఎద్దుల రాజు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని బీసీలకే కేటాయించాలి



**వనపర్తి ప్రతినిధి, జనవరి 19, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని బీసీలకే కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.అరవింద్ స్వామి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాస గృహంలో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంటులో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు జనరల్ కేటగిరి చెందినవని, అందులో రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలు గెలిచారన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో 60 శాతం పైగా బీసీ ఓటర్లే ఉన్నారు. కాబట్టి అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటు ఎంపీ స్థానాన్ని బీసీలకే కేటాయించాలని ఒకవేళ కేటాయించని పక్షంలో బీసీ ఓటర్లంతా ఏకమై అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ యాదవ్, పార్లమెంటు ఇంచార్జ్ బాలు మధు ముదిరాజ్ తరుణ్ గౌడ్ బీసీ నాయకులు పాల్గొని విజయవంతం చేశారు.

## 24న పదవ తరగతి ప్రతిభా పరీక్ష: ఎంఈఓ

కోయిల్‌కొండ, జనవరి 19 ప్రభాతవార్త : మండల కేంద్రమైన కోయి లకొండలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఈనెల 24వ తేదీన పదవ తరగతి ప్రతిభా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 534 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారని వారి కోసం పరీక్ష సన్నద్ధత కోసం ప్రతిభా పరీక్ష నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఉదయం ప్రతిభా పరీక్ష, మధ్యాహ్నం ప్రేరణ తరగతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాలకు వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవిందర్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి..

### వనపర్తి కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 19, ప్రభాతవార్త :** విద్యార్థులు 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి, జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో వనపర్తి జిల్లాను అగ్రస్థానంలో నిలుపడానికి విద్యాశాఖతో పాటు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉపాధ్యాయుల కృషి పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బాగా ప్రోత్సహిస్తే జిల్లాను అగ్రస్థానంలో నెలబెట్టవచ్చు అన్నారు. అందుకే జనవరి 20 వ తేదీన తల్లిదండ్రులతో ఎస్.యం.సి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అందరూ విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో వనపర్తి జిల్లా నుండి 6903 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నరు. ఇందులో ప్రభుత్వ, జడ్పి పాఠశాల, కే.జి.బి వి, మోడ్రన్, గురుకుల పాఠశలల నుండి 4225 మంది పరీక్షలు రాయనున్నారు. మిగిలిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి హాజరవుతారు. ప్రభుత్వ, గురుకుల, కే.జి.బి.వి.మోడ్రన్ పాఠశాలల నుండి రాసే విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించడానికి ఆది నుంచి పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవడం జరిగిందన్నారు. లక్ష్య అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాన్ని సులువుగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికతో విద్యాభ్యాసం చేయిస్తున్నాట్లు తెలిపారు. సిలబస్‌ను జనవరి 10, నాటికి పూర్తిచేసి 4రివిజన్ పరీక్షలు, రెండు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. పరీక్ష పత్రం సైతం డి.సి.ఈ.బి వారు తయారు చేసినది ఇవ్వడం వల్ల విద్యార్థుల సామర్థ్యం ముందే తెలుసుకోవచ్చు, ప్రతి రోజు ఉదయం 8:30 నుండి 9:30 వరకు, సాయంత్రం 4:30 నుండి 5:30 వరకు రెండు పూటలా సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించే విధంగా విద్యా శాఖ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందజేయడం జరుగుతుందనీ తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం ద్వారా ఏ విద్యార్థి ఎక్కడ ఏ విభాగంలో వెనకబడి ఉన్నది గుర్తించి సబ్జెక్ట్ ఉపాధ్యాయుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుంది. విద్యార్థులకు ప్రేరణ కల్పించేందుకు మానసిక వైద్య నిపుణుల చేత ఓరియెంటెషన్ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఏది ఏమైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి, తమ పిల్లల భవిష్యత్తు బాగుండటానికి విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)

# విద్యార్థులతో ఎంపీపీ విజయ్ కుమార్ ముఖాముఖి..

### 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం

**ధరూర్, జనవరి19, ప్రభాతవార్త:** గట్టు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వతరగతి చదువుతున్న విద్యార్థుల 100శాతం ఉత్తీర్ణత సాధించడంకోసం గట్టుఎంపీపీ విజయ్‌కుమార్, ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి పదవతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖా ముచ అనే చర్చ కార్యక్రమంను ఎంచుకున్నారు. ఇందులో భాగంగా నేడు తప్పెట్లమొర్సు, గొర్లఖాన్‌దొడ్డి, ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు , వారి తల్లిదండ్రులతో ముఖాముచ చర్చలో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. మండలంలోనిపదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఒక్కవిద్యార్థి, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి ఎగ్జామినేషన్ కిట్‌ను తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు గ్రామ సర్పంచు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లడుతూ సలహాలు, సూచనలు చేశారు. ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులతో ముఖాముచ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి లక్ష్యం తెలుసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. దీని వల్ల ప్రతి విద్యార్థి తాను ప్రత్యేక లక్ష్యం ఏర్పాటుచేసుకుని దాని సాధనకోసం ఇప్పటి నుండే ప్రణాళికలు చేసుకోవడం ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఇలాగే ప్రతి ఒక్కరు 10వ తరగతిలో 10/10 జిపిఏ పాయింట్ల సాధన దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షిం చా రు. ఈ చర్చలో నేను విద్యార్థులు వారి తల్లిదండ్రులు నుంచి చాలా విషయాలు గమనించారని అన్నారు. ప్రతి విద్యార్థికి చదువు అనేది చాలా ముఖ్యం అందులో పదవత రగతి ఉత్తీర్ణత అనేది మరి ముఖ్యంగా 10/10 జిపిఏ పాయింట్ల సాధన అందరికి అందుబాటులో ఉన్న లక్ష్యమని తెలిపారు. అందుకే ఈ పదవతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేయాలని తెలిపారు. గట్టు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పదవ తరగతి విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించేలా తన వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల చదువు పై సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 10/10 జిపిఏ పాయింట్లు సాధించాలని కోరారు. అలా 10/10 జిపిఏ పాయింట్లు సాధించిన విద్యార్థులకు 5016 నగదు పారితోషికం ఇస్తామని వారిలో ఉత్సా హం నింపారు. సమావేశంలో పదవతరగతి విద్యార్థిని విద్యార్థులు తమ లక్ష్యాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తప్పెట్ల మొర్సు సర్పంచు కృష్ణయ్య గౌడ్, జెడ్పి కోఆప్షన్ మెంబర్ ఇమామ్ సాబ్ ఎంపీటీసీ బొజ్జయ్య నాయుడు, ఐసిపిఎస్ అధికారిణి లక్ష్మి, ఎంవిఎఫ్ ఫౌండేషన్ ప్రతినిధి సదానంద ఆచారి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ యోగేశ్వర్, గ్రామ పెద్దలు, గద్వాల్ తిమ్మప్ప, సిద్దప్ప తిమ్మప్ప గౌడ్ , చంటి గౌడ్, నర్సింలు, డైరెక్టర్ తిమ్మప్ప, నర్సింలు గౌడ్, ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శులు తిమ్మప్ప, , లక్ష్మణ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపిపి

# అధ్యక్షుల ఎంపికలో బిసిలకు అన్యాయం..

**బిజెపి అధ్యక్షుల మార్పులో డికె అరుణ కుట్ర..బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస్‌సాగర్**



మాట్లాడుతున్న శ్రీనివాస్ సాగర్

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జనవరి 19 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ప్రకటించిన జిల్లా అధ్యక్షులలో ఒక్క బిసి అభ్యర్థికి అవకాశం రాకుండా పాలమూరు పార్లమెంట్ పరిధిలోని రెండు జిల్లా అధ్యక్షులు రెడ్డి సామాజికి వర్గానికి చెందిన వారికి ఇప్పించడంలో డికె అరుణ కుట్రపూరితంగా వ్యవహరించి బిసిలకు స్థానం లేకుండా చేయడంలో ఆంతర్యం ఏంటని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస్‌సాగర్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బిసి ముఖ్యమంత్రి అంటూ శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన భారతీయ జనతా పార్టీ బిసిలపై ఎందుకు వివక్ష చూపుతుందని ప్రశ్నించారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వీరబ్రహ్మం స్థానంలో శ్రీనివాస్‌రెడ్డిని, నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్ స్థానంలో జలంధర్‌రెడ్డిని నియమించడంలో కుట్రపూరితంగా జిల్లా అగ్రనాయకులు వ్యవహరించి బిసిలకు అన్యాయం చేయడం జరిగిందన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో 60% నుండి 70% ఉన్న బిసి సామాజిక వర్గం కాదని అగ్రవర్ణాలకు ఇవ్వడంలో బిసి సమాజానికి భారతీయ జనతా పార్టీ దూరం కావాల్సి వస్తుందన్నారు. గత ఎన్నో ఏళ్లుగా మహబూబ్‌నగర్ బిజెపిలో సీనియర్లుగా ఉన్న బిసిలకు కాదని రెడ్డి వర్గానికి ఇవ్వడం, బిసిలకు ఇస్తే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే ఉద్దేశంతో ఈ కుట్రకు పాల్పడిట్లు అర్థమవుతుందని చెప్పారు. రెండు నెలల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిసి అభ్యర్థిగా ముందుకు వస్తున్న శాంతికుమార్‌ను దృష్టిలో పెట్టుకుని ఏమైనా రాజకీయ కుట్ర జరిగిందా అన్న అనుమానం కూడా కలుగుతుందని ఆరోపించారు. పార్లమెంట్ అభ్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు రేపు పోటీలో ఉంటే బిసి సమాజ్ ఊరుకునే పరిస్థితిలో లేదన్నారు. కార్యక్రమంలో బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సత్యం సాగర్, బిసి జర్నలిస్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, బిసి సమాజ్ కో కన్వీనర్ ఆర్.సత్యం పాల్గొన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి...

**ఈ నెల 20, 21వ తేదిన ప్రత్యేక ఓటరు నమోదు దినోత్సవాలు.. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 19, ప్రభాతవార్త :** జనవరి 25న జరిగే 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎన్నికల కమిషన్ ఈ సారి జాతీయ ఓటర్ల దినోత్సవానికి నతింగ్ లైక్ ఓటింగ్ , ఐ ఓటు ఫర్ సూర్ నాయకరణం చేసినట్లు తెలిపారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను ప్రజలందరికి అవగాహన ఉండే విధంగా ముఖ్యంగా విద్యార్థులు, దివ్యాంగులకు భాగస్వామ్యం కల్పిస్తూ నిర్వహించాలని తెలిపారు. ఓటు ప్రాముఖ్యతపై విద్యాసంస్థల్లో చర్చలు, ఫోటీలు, డ్రాయింగ్, స్కిట్ , పాటల , పెయింటింగ్, వ్యాసరచన, వంటి ఫోటీలను నిర్వహించాలని ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ అధికారి, విద్యాధికారికి ఆదేశాలను జారీ చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు తన ఓటును వినియోగించుకునే విధంగా అవగాహన కార్యక్రమంను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాన్ని కోవిడ్ 19 మార్గదర్శకాలు అనుసారం నిర్వహిస్తూ 25వ తేదిన విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, పిఎస్‌యు , జిల్లా అధికారులు కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది జాతీయ ఓటరు దినోత్సవం ప్రతిజ్ఞా నిర్వహించాలన్నారు. దివ్యాంగులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, సమాజంలోని బడుగు బలహీనవర్గాలను జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.

## ఈ నెల 20, 21వ తేదిన ప్రత్యేక ఓటరు నమోదు దినోత్సవాలు ...

జిల్లాలో ఈ నెల 20, 21వ తేది( శని, ఆదివారం రోజుల్లో ) ప్రత్యేక ఓటరు నమోదు దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జనవరి 01, 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన ప్రతి యువత తమపేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కింద ప్రతి బిఎల్ఓ తన పోలింగ్ కేంద్రంలో ఉంటారని, అక్కడ ఫారం 6 తీసుకుని లేదా ఆన్‌లైన్ ద్వారా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌లు సైతం తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రూపొందించిన ఓటరు జాబితాలో తమ పేరులో తప్పులు ఉన్న లేక పోలింగ్ స్టేషన్ మార్చుకోవాలని అనుకున్న వారు ఫారం 8 ద్వారా మార్చుకోవచ్చని జిల్లా ప్రజలు ఈ ప్రత్యేక క్యాంపెయిన్ రోజులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్‌పి చైర్ పర్సన్ సరితమ్మ

**మన ఊరు మన బడి కింద పాఠశాలలో పనులు ప్రారంభం కాకపోవడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం**





జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన జడ్పీ చైర్ పర్సన్ సరితమ్మ

**మల్దకల్, జనవరి19, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గద్వాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరితమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ఎంపిక చేశారు. వాటి సంబంధించిన పనులు ఇంకా మొదలు కాకపోవడంపై సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. పనులు చేస్తానన్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ఆగిపోయాయని చెప్పారు. అయితే ఆ కాంట్రాక్టర్ చేయకపోతే వేరే వారికి పనులు అప్పజెప్పి తొందర్లోనే పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

## వార్త పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



**వనపర్తి ప్రతినిధి, జనవరి 19, ప్రభాతవార్త :** వార్త తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను శుక్రవారం తిరుమల సరస్వతి డెవలపర్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల మహేష్, మార్కెట్ కమిటి మాజి చైర్మన్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు శ్రీనివాస్ గౌడ్‌లు వారి కార్యాలయాల్లో వేర్వరుగా వార్త జిల్లా స్టాఫర్ రాముతో కలిసి ఆవిష్కరించారు. ప్రజల పక్షాన నిలబడుతూ ముందుకు సాగాలన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నారాయణ..



**వనపర్తి ప్రతినిధి జనవరి 19 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నారాయణను పార్టీ రాష్ట్ర అధిష్టానం నూతనంగా నియ మించింది. వనప ర్తికి చెందిన నారాయణ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న కొత్తకోటకు చెందిన రాజ వర్ధన్‌రెడ్డి స్థానంలో నారాయణను నియమిస్తున్నట్లు గురువారం రాత్రి బిజెపి అధిష్టానం ప్రకటించింది.

## గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

**మాజీ సర్పంచ్ కుమ్మరి రాములు**

**కోయిల్‌కొండ, జనవరి 19 ప్రభాతవార్త :** ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్న సందర్భంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందని వ్యాపారవేత్త, వింజమూరు గ్రామ మాజీ సర్పంచ్ కుమ్మరి రాములు తెలిపారు. భజన భక్తులకు సైతం సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం మండల కేంద్రమైన కోయిల్ కొండలో ప్రసిద్ధి గాంచిన శ్రీ ఆది ఆంజనేయస్వామి దేవాలయంలో అదే రోజున ఆంజనేయస్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిచండం జరుగుతుందన్నారు.

## నవాబ్‌పేట మీదుగా మహబూబ్‌నగర్‌కు బస్సు నడపాలి



**నవాబ్‌పేట, జనవరి 19 ప్రభాతవార్త :** మండలంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మండల ప్రజలు కలిసి వినతి పత్రం అందజేశారు. నవాబ్‌పేట మండలంలో చాలా గ్రామాకు బస్సులు నడవడం లేదని కారుకొండ నుండి కిష్టారం వరకు, తీగలపల్లి నుండి కాకర్లపాడు మీదుగా మహబూబ్‌నగర్, కారూర్, ఇప్పటూర్, కూచూర్‌మీదుగా మహబూబ్‌నగర్, షాద్‌నగర్ నుండి దేపల్లె, కొల్లూరు, పోమాల, నవాబ్‌పేల మీదుగా మహబూబ్‌నగర్ వరకు బస్సు నడపాలని కారుకొండగ్రామానికి మహబూబ్‌నగర్ నుండి కిష్టారం వరకు ఎప్పటిలాగే ఐదు ట్రిప్పులు బస్సు నడపాలని రవాణాశాఖ మంత్రికి వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెంటనే డిఎంను పిలిచి కారుకొండ నుండి కిష్టారం వరకు ఇదివరకు లాగే బస్సులు నడపాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మె ల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ మండల నాయకులు భూపా ల్‌రెడ్డి, కారుకొండ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌లు కలసి వినతి పత్రం ఇచ్చారు.

# విపత్తుల నిర్వహణ సంస్థ సేవలు అభినందనీయం

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవినాయక్
- పదవ బెటాలియన్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి19 ప్రభాతవార్త:** విపత్తులు సంభవించినప్పుడు, ప్రజల ప్రాణాలను కాపాడటంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని ఆవరణలో కూలిపోయిన కట్టడాల నుండి ప్రజలను రక్షించడంపై నిర్వహించిన మాదిరి డ్రిల్‌కు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనవరి 19న జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవిర్భవించిన రోజు సందర్భంగా ముందుగా ఆయన జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థకు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు వారిని కాపాడటం ద్వారా ప్రజలలో ఆత్మవిశ్వాసం నెలకొల్పేందుకు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఇలాంటి మాదిరి డ్రిల్‌ను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో నిర్వహి స్తారని తెలిపారు. ఎక్కడైనా విపత్తులు సంభవిస్తే జాతీయ విపత్తుల సంస్థ బృందాలు సిద్దంగా ఉంటాయని, తాను ప్రత్యక్షంగా జగిత్యాల జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో, అదేవిధంగా గత సంవత్సరం తెలంగాణలో సంభవించిన భారీ వర్షాలలో చిక్కుకున్న 10 మంది ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఒక ద్వీపంలో ఇరుక్కుపోయిన గొర్రెలను, మనుషులను రక్షించిన ఘనత ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు ఉందని తెలిపారు. ఈ విధంగా మాక్‌డ్రిల్ నిర్వహించడం వలన ప్రజల్లో ఆత్మవిశ్వాసంతో పాటు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందానికి సైతం ప్రాక్టీసులా ఉంటుందని అన్నారు. ఎక్కడైనా భవనాలు, నిర్మాణాలు కూలిపోయినప్పుడు లోపలికి వెళ్లేందుకు మెట్లు, లిఫ్టలు పనిచేయకపోవడం, అలాగే అగ్ని ప్రమాదాల వంటివి సంభవించినప్పుడు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఎలా రక్షిస్తాయో కళ్లకు కట్టినట్లుగా తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడారు. డిఆర్‌డిఓ యాదయ్య, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్‌ఓ కెవివి రవికుమార్, జిల్లా అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్







మాక్డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

## చౌడేశ్వరి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

■ జిల్లా స్థానిక సంస్థలు, అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్



**పెబ్బేరు,జనవరి 19,ప్రభాతవార్త:** శ్రీ చౌడేశ్వరి దేవి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా స్థానిక సంస్థలు,అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్ ఆదేశించారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ సర్సన్ కరుణ శ్రీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు సూచించారు.వచ్చే నెలలో 9 నుంచి ప్రారంభం కానున్న చౌడేశ్వరి దేవి ఉత్సవాలలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా సౌకర్యాలు చేపట్టాలని తెలిపారు.పట్టణంలో వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడకుండా జూరాల కాల్వ పై దారి మళ్లించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో ఆయన పర్యటించారు.వనపర్తి ప్రధాన రోడ్డు నుంచి జూరాల క్వాల మీదుగా సంత స్థలంలో నుండి కర్నూలు రోడ్డుకు వెళ్లే విధంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.ఈయన వెంట వైస్ చైర్మన్ కర్రెస్వామి,కమిషనర్ ఆదిశేషు,కౌన్సిలర్లు,ఏ.ఈ.రమేష్ నాయుడు, నాయకులు సాయినాథ్,వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన



దరఖాస్తు దారులకు రహదారి భద్రత పై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహాన్

**వనపర్తి ప్రతినిధి, జనవరి19,ప్రభాతవార్త:** రహదారి భద్రత పై ప్రతి ఒక్కరు అవగహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహాన్ వాహనదారులకు సూచించారు.35 వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల భాగంగా శుక్రవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖాధికారి అవినాష్ నాయక్ చౌహాన్ కార్యాలయం కు వొచ్చి నటువంటి దరకస్తుదారులకు రహదారి భద్రత గురించి అవగహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సదస్సులో రహదారి పై వెల్లెటప్పుడు కచ్చితంగా సీట్ బెల్ట్ ధరించాలని,హెల్మట్ లేకుండ వాహనములు నడుపరాదని,డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సబేరా బాను,సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ఇటిక్యాల జనవరి19, ప్రభాత వార్త:** మండల పరిధిలోని శేకుపల్లి గ్రామంలో బీచుపల్లి 85 సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎర్రవల్లి ఎంపిటిసి నీలిలక్ష్మీ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుం బాన్ని ఓదార్చి ఆ కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజే శారు. వీరి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్,సర్పంచు మధునాయుడు, గ్రామ నాయకుడు యువరాజు నారాయణ, మద్దిలేటి బలరాముడు, చిన్న కృష్ణయ్య నాయుడు పాల్గొన్నారు. ఏ విధంగా కొండేరు గ్రామానికి చెందిన విధంగా శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ పోతురాజు భౌతికకాయానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. వీరి వెంట గ్రామనాయకులు యువరాజు, నారాయణ, రామిరెడ్డి, లక్ష్మన్న, సవారన్న, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన వార్త దినపత్రిక

### నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్సై శ్రీనివాస్

**లింగాల,జనవరి 19 ప్రభాతవార్త:** సమాజంలో జరుగుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంలో వార్త దినపత్రిక కీలకంగా పని చేస్తుందని ఎస్సై శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన క్యాలెండర్‌ను వార్త దినపత్రి మండల రిపోర్టర్ టి.రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికలు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. జాతీయ స్థాయిలో పేరున్న వార్త పత్రిక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వతాలు, స్వామి, ఎఎస్సై శ్రీనివాసులు, కానిస్టేబుల్ బాలరాజు, సుల్తాన్‌పాషా, మార్కం పర్వతాలు పాల్గొన్నారు.



## రోడ్ల విస్తరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి

- వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్

**వనపర్తి ప్రతినిధి,జనవరి 19, ప్రభాతవార్త:** పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులను ప్రస్తుత ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సత్వరమే పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ అన్నారు. పట్టణంలో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌తో ఉన్న సంబంధాల వల్ల రాష్ట్ర అభివృద్ధి నిధులు రూ 29 కోట్లు, టిఎఫ్ఐడిసి ద్వారా మరో రూ 50 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. వీటితో పట్టణంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు దాదాపు 80 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారిందనే కారణంతో ఎమ్మెల్యే , అధికారులు, కలెక్టర్ రోడ్ల విస్తరణ పనులను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి కోసం మంజూరు చేయించిన నిధులను వెనక్కి పోయేలా చేయడం అభివృద్ధి నిరోధకమే అవుతుందన్నారు. మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్లు సిద్దంగా ఉన్నారని, ప్రజలకు మాత్రం మిగిలిన ప్రతి పనిని పూర్తి చేయిస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు మరో పక్క కాంట్రాక్టర్లతో పని చేస్తే బిల్లులు రావని బయటపెట్టడం సమంజసం కాదన్నారు. ప్రజలు ఓటేసి గెలిపించి అధికారం ఇచ్చారనే చిత్తశుద్ది కాంగ్రెస్ నాయకులకు ఉంటే వెంటనే రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కోటారీల ద్వారా హంగు ఆర్భాటాలు, ప్రచారాలే తప్ప సాధిస్తున్న అభివృద్ధి ఏమి లేదన్నారు. కాంట్రాక్టర్లను పిలిచి బిల్లులు చెల్లిస్తాం పనులు సత్వరమే మొదలు పెట్టాలని ఎమ్మెల్యే హామి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారుకృష్ణ, సమద్, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల కుటుంబాలకిచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

◆ తెలంగాణ అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మణ్యం ◆ పాలమూరు కావలిసువర్ణ 14వ వర్ధంతి



**పెబ్బేరు,జనవరి 19,ప్రభాతవార్త:** స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలంగాణ అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మణ్యం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన మొదటి మహిళా యోధురాలు కావలి సువర్ణ 14వ వర్ధంతి సందర్భంగా పెబ్బేరు మండలం వై శాఖాపుర్ గ్రామంలోని ప్రగతి విద్యాలయంలో ఆమె చిత్ర పటానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ విముక్తి పోరాటంలో 1200 మంది వీరులు తమ ప్రాణాలర్పించారన్నారు. వీరిలో చాలామందిని ఇంతవరకు గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.బిడ్డలను కోల్పోయి కడుపుకోత అనుభవిస్తున్న తల్లిదండ్రులకు ఎలాంటి గౌరవం దక్కలేదని మండిపడ్డారు.గత ప్రభుత్వం విస్మరించిన అమరులను ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే గుర్తించాలని కోరారు.కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అమరుల కుటుంబాలకు ఎన్నో హామీలిచ్చిందని గుర్తు చేశారు. ప్రతి అమరుని కుటుంబానికి ఇస్తామన్న 250 గజాల ఇంటిస్థలం,నెలకు ఇరవై ఐదువేల పెన్షన్ ను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినమైన జూన్ రెండు వరకు అమలుచేయాలన్నారు.తెలంగాణ ఆత్మగౌరవం కోసం,అస్థిత్వం కోసం 1946 తెలంగాణ సాయుధపోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య మొదలుకొని వేలాదిమంది వీరులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేసుకున్నారు.అమరుల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాలంటే అమరులను మనం తప్పకుండా స్మరించుకోవాలని పిలుపిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భీమ్ సాగర్,ప్రిన్స్‌పల్ రిజో, ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

◆ అధికారులను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు



గణతంత్ర దినోత్సవ వేడుకలపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

**ఇటిక్యాలజనవరి19, ప్రభాతవార్త:** ఈనెల 26న జరిగే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలు నందు ఈ నెల 26 న స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు పక్కాగా నిర్వహించి కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలన్నారు. పోలీస్ పరేడ్, జాతీయ పతాకావిష్కరణ, స్వతంత్ర సమరయోధులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగలను ప్రశంసా పత్రాలను బహుకరణ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాలకు హజరయ్యే ముఖ్య అతిథులకు, ప్రజాప్రతినిధులు, మీడియా తదితరులకు అవసరమైన ఆసనాల ఏర్పాటుతో పాటు, ప్రజలకు త్రాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ, శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరిని ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ఆయా శాఖాలు ఎగ్జిబిషన్ స్టాలు కూడా ఏర్పాటుచేయాలని సూచించారు. జాతీయ జెండా ఏర్పాటు ప్రోటోకాల్ ప్రకారం వివిప కుర్చీలు, టెంట్లు, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు కార్యక్రమాల నిర్వహణ ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితరం అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏఓ బద్రప్ప, ఇంచార్జి డిఆర్‌డిఏ కాంతమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు



**గద్వాల ప్రతినిధి,జనవరి 19 ప్రభాతవార్త :** త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర అతి ముఖ్యమైనదని, ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఈవిఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఐడిఓసి సమావేశం హాల్ లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు 2024 గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన సెక్టోరియల్ ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని, సెక్టార్ అధికారి తమపరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఈవిఎం, వివి ప్యాట్లు, హ్యాండ్‌బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకుని ఉండాలని తెలిపారు.ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజున తగు సూచనలు అందించాలని తెలిపారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహాసిల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే శిక్షకులచే నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగ జరిగేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన రోజునుండి పోలింగ్ పూర్తి అయ్యే వరకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తల పట్ల ప్రిసైడింగ్ అధికారులుగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. పోలింగ్ సందర్భంగా ప్రతి పిఓ తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవిఎంల నిర్వహణ, ఓటరు జాబితా మార్క్డ్ కాపీ, పిఓ, ఎపిఓ డైరీ వారి విధులు, పోలింగ్ కేంద్రం బయట తీసుకోవలసిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, మాక్ పోల్, ఈవిఎం, వివి ప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదివి తెలుసుకోవాలని,పిపిటి ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డిసి సుబ్రమణ్యం, అలంపూర్ ఎన్నికల నోడల్ అధికారి ఆర్‌డిఓ చంద్రకళ, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎన్నికల విభాగం అధికారులు కరుణాకర్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మాగనూరు,జనవరి 19 ప్రభాతవార్త :** విధులను నిర్లక్ష్యం చేస్తే ఎలాంటి వారికైనా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని వైద్యారోగ్య శాఖలో పిహెచ్‌సిలలో పనిచేసే ముగ్గురు వైద్యులను టర్మినేట్ చేస్తూ ఒక ఎఎన్‌ఎంను, ఒక సిహెచ్‌ఓను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెర్మినెట్ యిన వారిలో డా. రాజేష్ చేగుట, డా. నాగరత్నం, కృష్ణ, డా. నరేష్, కున్సిలను టెర్మినెట్ చేసినట్లు యాదమ్మ, సూపర్‌వైజర్ సాయిబాబు, సిహెచ్‌ఓ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్ల పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి

ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్



పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,జనవరి19 ప్రభాతవార్త:** జిల్లాలో మంజూరైన ఇంజనీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ నందు ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ ఈఈ,డిఇలతో టిఎస్‌ఎం.డిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయాశాఖల ఇంజనీరింగ్ అధికారులను పనుల పురోగతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ పనులు మంజూరు అయ్యాయో ఇప్పటికి ఎన్ని పూర్తయ్యాయని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మంజూరైన పనులన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోగ్రెస్ ఉన్న పనులను ఫైనల్ చేయాలని అన్నారు. గ్రామాలలోని సిసి రోడ్లు, కాలువల పనుల పై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలోని చిన్న చిన్న పనులు పెండింగ్ ఉన్నాయని కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ పరిధిలో మంజూరు అయిన పనులను ఫైనల్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో పెండింగ్ పనులను పర్యవేక్షించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఇఇ ప్రగతి, పిఆర్ఇఇ ఆంజనేయులు రహీమ్, శ్రీనివాసులు, రాజేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎపిఆర్‌ఒగా సుభాష్ ఎంపిక

**వనపర్తి ప్రతినిధి, జనవరి19, ప్రభాతవార్త:** జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం, వనపర్తి లో ఎ.పి.ఆర్.ఒ (ఔట్ సోర్సింగ్)గా విధులు నిర్వహిస్తున్న మహమూద్ పాషా ఇటీవల తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయగా ఏర్పడిన ఖాళీని నేడు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ ద్వారా వ్రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి అత్యధిక మార్కులు సంపాదించిన సుగురి సుభాష్‌ను కొత్త ఎ.పి.ఆర్.ఒ ఔట్ సోర్సింగ్ నియమితులు అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఖాళీ ఏర్పడిన ఒక ఎ.పి.ఆర్.ఒ పోస్టుకు జనవరి 4వ తేదిన పత్రిక ప్రకటన ద్వారా నోటిఫికేషన్ జారీ చేయగా 7 మంది అభ్యర్థులు జర్నలిజం పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. నేటి పరీక్షకు 6 మంది అభ్యర్థులు హాజరు కాగా అత్యధిక మార్కులు సుగురి సుభాష్ తెచ్చుకోగా రెండవ స్థానంలో యాదగిరి ఉన్నారు. దీంతో జిల్లా ఎంపిక కమిటీ సుభాష్‌ను ఎ.పి.ఆర్.ఒ గా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ ప్యానెల్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డిపిఆర్‌ఒపి సీతారాం, ఎంప్లాయ్ మెంట్ అధికారి మోజా ని పాష , సిపిఓ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## లైసెన్సు లేకుంటే చర్యలు

- మున్సిపల్ 10శాతం స్థలాల్లో బోర్డులు ఏర్పాటు
- జడ్చర్ల మున్సిపల్ కమిషన్ షేక్ మహెమూద్




బోర్డులు ఏర్పాటు చేసిన మున్సిపల్ సిబ్బంది

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల నిర్వహణకు సంబంధించి తప్పనిసరి లైసెన్సులు పొందాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ షేక్ మహెమూద్ హెచ్చరించారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని లైసెన్సు లేకుండా వ్యాపారులు నిర్వహిస్తున్న పలు దుకాణాలను మూసివేయించారు. లైసెన్సు లేనివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారం రోజుల్లో లైసెన్సు అందజేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ పరధిలోని వెంచర్లలో నిబంధనల ప్రకారం వదిలిన 10 శాతం భూములపై ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు సిబ్బంది కదిలా రు. ఆక్రమణకు గురికాకుండా చర్యలకు పూనుకున్నారు. ఎక్కడైనా వెంచర్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదిశాతం భూమిని ప్రభుత్వ స్థలంగా కేటాయించి పార్కుల కోసం విడిచి పెట్టాల్సి ఉంటుంది, ఇందులో భాగంగా శనివారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధి లోని 13ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లలో మున్సిపల్ సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేశారు. బోయలకుంట రోడ్డులో ఏడు, ఫెరోజ్ నగర్‌లో1, పోచమ్మ ఆలయం వెనకాల 1, కల్వకుర్తి రోడ్డులో 1, గౌరీ శంకర్ కాలనీలో 3 ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లు కమిషన్ షేక్ మహెమూద్ తెలిపారు. ఇదిలా ఉండగా చాలా వరకు వెంచర్లలో నిబంధనలపై 10శాతం స్థలాన్ని వదిలేసిన అనంతరం ఆ స్థలంలో కూడాలేఅవుట్లు చేసి చాలా వరకు ప్లాట్లు విక్రయించారు. కొన్ని చోట్ల ఆక్రమణకు కూడ గురయ్యాయి. అలాంటి స్థలాలను కూడా మున్సిపల్ అధికారులు పరిశీలించి విచారణ జరిపి పార్కులు ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## క్రైస్తవుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

**అమరచింత జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి క్రైస్తవుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఖానాపురం ఒకటో వార్డు క్రైస్తవం ఎంబి చర్చి 39వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, కేశవ్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ క్రైస్తవులను గత టీఆర్ఎస్ ప్రభుత్వం చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్న వారికి గౌరవ వేతనం ఇస్తామని చెప్పడం అభినందనీయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే ఖానాపూర్ ఎంబి చర్చి అభివృద్ధి కోసం మక్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి సహకారంతో ఐదు లక్షల నిధులు మంజూరు చేస్తానని ఆయన క్రైస్తవులకు హామి ఇచ్చారు. క్రైస్తవుల యువకుల ఉపాధి కోసం కార్పొరేషన్ ద్వారా రుణాలు పొంది ఉపాధి పొందాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్, మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసి రాజు యాదవ్, రహిమతుల్లా కేజీ మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ చెన్నయ్య, నాగేశ్, ఎంబి చర్చి పాస్టర్ సుమన్, లింగన్న గౌడ్, ఎండి రఫీ, గడ్డం శ్రీకాంత్, వంశి, తదితరులు పాల్గొన్నారు.




కేశం నాగరాజు గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంబి చర్చి పెద్దలు

# జిల్లా పోలీసురక్ష కళాబృందం అవగాహన కార్యక్రమం

**అడ్డాకుల,జనవరి 19 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల పోలీస్ స్టేషన్ పరిధిలోని కందూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11.30 గం.ల నుండి మధ్యాహ్నం 1.30 గం.ల వరకు సురక్ష పోలీసు కళాబృందం వారి సామాజిక అవగాహన కార్యక్రమం బాల బాలికలు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని, మనపెద్దలు చెప్పినట్లుగా కష్టం చేసిన వారెన్నడూ చెడిపోరని పోలీస్ కళా బృందం సభ్యులు మాటలు పాటల ద్వారా వివరించారు. మనదేశంలోని యువత స్వయంకృషితో అత్యున్నత స్థాయికి ఎదుగుతున్న విషయం చూస్తూనే ఉన్నామని, అటువంటి వారి స్ఫూర్తితో విద్యవైపుగా మన గ్రామీణ యువత దృష్టి సారించి, తల్లిదండ్రులకు పుట్టిన ఊరుకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని స్ఫూర్తినిచ్చారు. చిన్న వయసులో ప్రేమ అంటూ చెడు ఆలోచనలు, అలవాట్ల వలన మనమెప్పటికి ఎదగలేమని, ఒక ఉత్తమమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని పోలీస్ కళాబృందం సభ్యులు ఆట పాటల ద్వారా సూచించారు. పిల్లలను ఉత్తమ మార్గంవైపు నడిపించేందుకు తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు సమయం కేటాయించడం, శ్రద్ధ తీసుకోవడం అవసరమని తెలిపారు. బాల్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వివాహాల వలన వ్యక్తిగత అనర్థాలు జరగడమే కాకుండా సమాజానికి తీరని నష్టం వాటిల్లుతోందని, బాల్యవివాహాల వలన వ్యక్తిగత అనర్థాలు జరగడమే కాకుండా సమాజానికి తీరని నష్టం వాటిల్లుతోదని, బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఎవరైనా అలా చేయాలని ప్రయత్నించినచో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని, అలాగే సైబర్ నేరగాళ్ల వలలో పడకూడదని, అనుకోని విధంగా మాయ మాటలతో అకౌంట్లో నుండి ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్న ఎడల సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి 24 గంటలలోపు కాల్ చేయాలని సూచించారు. యువత సామాజిక మాధ్యమాలు మొబైల్‌ఫోన్లు మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టించి పని చేయడంలోనే శక్తి సామర్థ్యాలను గౌరవాన్ని హోదాను పొందాలని వివరించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల వలన జరుగుతున్న తీవ్రమైన నష్టాలు కుటుంబం మొత్తం అంతులేని దు:ఖంలో మునిగిపోతున్న దుర్ఘటనలు మన కండ్ల ముందు ఉన్నాయని అందుకే పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని పెద్దలు కూడా మద్యం సేవించి హెల్మెట్ లేకుండా దురుసుగా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వారి కుటుంబాలను రోడ్ల పాలు చేస్తుందని పోలీస్ కళాబృందం సభ్యులు పాటలతో మాటలతో వివరించారు. మనజిల్లా ప్రజలు ముఖ్యంగా యువత బాల బాలికలు గొప్పగా ఎదగాలన్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ సందేశాన్ని సురక్ష పోలీస్ కళాబృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురుమూర్తి, అధ్యాపకులు అడ్డాకుల పోలీస్ స్టేషన్ నుండి పోలీస్ కానిస్టేబుల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై నేడు రేపు ప్రచార కార్యక్రమాలు

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 19 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20,21 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 1,2024 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారందరూ తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ రెండు రోజులలో బూతుస్థాయి అధికారులు వారికి కేటాయించిన బూతులలో ఉదయం 10 గం.ల నుండి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పు, చేర్పులు వంటి వాటికి సంబంధించి ఓటర్లు సమర్పించే ఫారాలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారిని ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, ట్రాన్స్‌జెండర్స్‌ను అలాగే అర్హత ఉన్న దివ్యంగా ఓటర్లను ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లను బిఎల్‌ఓలు పరిశీలించుకోవాలని, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ప్రముఖుల పేర్లన్ని ఓటరు జాబితాలో ఉన్నది లేనిది సరి చూసుకోవాలన్నారు. వీటితో పాటు, పోలింగ్ కేంద్రాల జియో కో ఆర్డినేటర్స్ తెప్పించుకోవాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు 10 శాతం బిఎల్‌ఓల పనులను సూపర్ చెక్ చేయాలని, అదేవిధంగా ఈఆర్‌ఓలు 10 శాతం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా తుది ఓటరు జాబితానుఫిబ్రవరి 8నప్రచురించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

## రైతులకు అందుబాటులో 45టన్నుల యూరియా

**కల్వకుర్తి, జనవరి 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పీఏసీఎస్ గోదామ్‌లో 45 టన్నుల (1000 బస్తాల)యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కావాల్సిన రైతులు రూ.267లు చెల్లించడంతో తమ ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం జిరాక్స్‌లు ఇచ్చి యూరియాను తీసుకోవాలన్నారు. ఇట్టి అవకాశాన్ని కల్వకుర్తి, ఊర్కొండ మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్యాం, డైరెక్టర్లు రామునాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## పూర్వపు విద్యార్థుల ఔదార్యంతో 4 సీసీ కెమెరాల బహుకరణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నాగర్‌కర్నూల్‌లో 1967లో ఎస్సెస్సీ పూర్తి చేసిన పూర్వపు విద్యార్థులు శుక్రవారం రూ.20వేలు విలువ చేసే 4 సీసీ కెమెరాలను బహుకరించారు. అదే బ్యాచ్‌కు చెందిన ఇంద్రారెడ్డి రూ.15వేలతో పాఠశాలలోని శుద్ధనీటి వాటర్ ప్లాంట్‌ను పునరద్ధరించారు. పాఠశాలలో చదువుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన పూర్వపు విద్యార్థులను క్లాస్‌మెంట్ తరుపున అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎండీ.సిద్ధిఖ్ హుస్సేన్, క్లాస్‌మెట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాజయ్య, ప్రతినిధులు కిరణ్, పి.శివ, ఆనంద్, పి.గోపాల్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎంపిడిఓకు వినతి

**బాలానగర్,జనవరి19 ప్రభాతవార్త:** సర్పంచ్‌లు పదవికాలం ముగుస్తున్నందున తాము చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కృష్ణారావుకు మండల సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలానగర్ మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, దాదాపు 5 సంవత్సరాల నుండి వైకుంఠధామం నిర్మాణం, సెగ్రియేషన్ షెడ్ నిర్మాణం, క్రీడా మైదానాల పనులు, ప్రతి సంవత్సరం నర్సరీ పనులు, గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, ఎన్‌హెచ్ 44 రోడ్డుకు ఆనుకుని ఉన్న 5 గ్రామ పంచాయతీలు చెట్లు పెట్టించి, ప్రతిరోజు నీరు పోయించి అప్పులపాలు అయ్యాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలకు గత 18 నెలల నుండి కేంద్రంనిధులు,రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఇవ్వడం లేదని గ్రామాల్లో సిసిరోడ్డుపనులు,అంతర్గత మురికి కాలువలు, నిర్మాణ పనులు, ట్రాక్టర్, ట్రాలీ,ట్యాంకర్‌ల కొనుగోలు, ప్రతినెల కిస్తులు, డీజిల్ మెయింటెనెన్స్, వీధిలైట్లు, మోటార్ల మరమ్మతులు కొత్తవి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

## 20,21న ఓటరు స్పెషల్ క్యాంపైన్ డే

**బాలానగర్,జనవరి 19 ప్రభాతవార్త:** జనవరి 1,2024 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారందరు ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా తమ పేరును నమోదు చేసుకోవాలని బాలానగర్ తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఈనెల 20,21వ తేదీలలో (శనివారం, ఆదివారం)న స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ పరిధిలోని పోలింగ్ బూతులలో బిఎల్‌ఓలు ఓటర్ల జాబితాతో అందుబాటులో ఉంటారని, యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ పేర్కొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కేసులు

**చిన్నచింతకుంట,జనవరి 19 ప్రభాతవార్త:** మైనర్లు వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్సై ఆర్.శేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలను నడుపుతూ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని వాహనాలు ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలను ఇవ్వడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.వాహనాలకు చెందిన సరైన కాగితాలు, వాహనదారులు ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలం రాకొండ గ్రామ సర్పంచ్ నరేందర్‌గౌడ్‌ను అనారోగ్య రీత్య మహబూబ్ నగర్‌లోని శ్రీఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని నరేందర్‌గౌడ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి గ్రామ సర్పంచ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

# రోడెక్కిన లబ్ధిదారులు

● పోలీసుల జోక్యంతో విరమణ ● త్వరలో ఇళ్ల స్థలాలు చూయిస్తాం ● తహసీల్దార్ కృష్ణయ్య



ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగిన లబ్ధిదారులు

**చిన్నచింతకుంట,జనవరి 19 ప్రభాతవార్త:** పట్టాలిచ్చారు ఇండ్ల స్థలాలు చూయించడం లేదని లబ్దిదారులు రోడెక్కారు. శుక్రవారం మండల పరిదిలోని ఏదులాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఇల్లులేని నిరుపేదలను గుర్తించి వారికి గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. కాని అట్టి స్థలంలో ముళ్ళపొదలు ఉండడంతో వాటిని చదునుచేసి ఇళ్ల స్థలాలకై లబ్దిదారులు స్థలంలోని ముళ్ళ పొదలను జెసిబితో తొలగిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీంతో లబ్దదారులు ఆత్మకూర్, దేవరకద్ర ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. ముండ్ల పొదలను తొలగించి ఇండ్ల స్థలాలు చూపించాలని సర్పంచ్ హైమావతి శివశంకర్‌గౌడ్‌లతో పాటు ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా పలు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. ఆందోళన సమాచారం అందుకున్న ఎస్సై శేఖర్ తన పోలీస్ బృందంతో ఆందోళనకారుల వద్దకు వెళ్లి రోడ్డుపై ఆందోళన దిగి ప్రయాణీకులకు ఇబ్బంది వస్తే సమస్య పరిష్కారం కాదని మీ సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించి తహసిల్దార్ కృష్ణయ్యకు సమాచారం అందించారు. దీంతో ఆందోళనకారులు తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసిల్దార్‌తో తమ సమస్యను లబ్దిదారులు వివరించారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ముళ్ల పొదలను తొలగించి స్థలాన్ని చదును చేసి సర్వేయర్‌తో ప్లాట్లుగా మార్చి ఇండ్ల పట్టాలు పొందిన ప్రతి లబ్దిదారులకు నెల రోజులలోపు పంపిణీ చేస్తామని తహసిల్దార్ హామీ ఇవ్వడంతో లబ్దిదారులు శాంతించారు.



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న ఎస్సై శేఖర్

# వికసిత్ భారత్ ప్రధాని మోడీతోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులు చేయడమే మోడీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. 22వ తేదీన అయోధ్యలోని రామజన్మభూమి రామ్‌లీలా స్థలంలో ప్రధాని నరెంద్రమోడీ రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసే కార్యక్రమాన్ని భారతీయులకై కాకుండా ప్రపంచ దేశాలకు గర్వకారణం అన్నారు. ప్రభుత్వ సంస్థలకు 22వ తేదీ మధ్యాహ్నం నుండి కేంద్ర సెలవు ప్రకటించిందని ప్రతి ఒక్కరు ఆ కార్యక్రమాన్ని వీక్షించాలని ఆయన సూచించారు. అంతకు ముందు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రెటరీ రాజ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో భారత్ వికసిత్ సంకల్ప యాత్ర విజయవంతంగా కొనసాగుతుందని జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు పుష్కలంగా లభిస్తున్నాయని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరడమే యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. అదనపు కలెక్టర్‌కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత్ వికసిత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రతి లబ్దిదారుడికి నేరుగా గ్రామాల్లోని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ యాత్రలో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందాలన్నారు. అంతకు ముందు వీక్షిత్ భారత్ యాత్ర ప్రధాని మోడీ సందేశాన్ని వీక్షించి, 2047 నాటికి అభివృద్ధి భారత్‌గా అవతరించేందుకు సంకల్పయాత్ర ప్రతిజ్ఞను చేశారు.



మహిళా సంఘాలకు రుణాల చెక్కులు అందజేస్తున్న కేంద్రమంత్రి

అనంతరం వివిధ బ్యాంకుల ద్వారా జిల్లాలోని వివిధ మహిళ బ్యాంకుల ద్వారా జిల్లాలోని వివిధ మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. బ్యాంకర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి జిల్లాలోని లబ్దిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజ్‌కుమార్ మిశ్రా, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, బిజెపి రాష్ట్ర నాయకులు దిలీపచార్య, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఎన్ సుధాకర్‌రావు, యూనియన్ బ్యాంకు డిజిఎం సత్యనారాయణ, డిఆర్‌డిఏ నర్సింగ్‌రావు, నాబార్డు డిడిఎం అచల్, ఎల్‌డిఎం కౌశల్ కిశోర్‌పాండే, డిఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, వీక్షిత్ భారత్‌యాత్ర జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామిరెడ్డి, తహసిల్దార్ శ్రీరాములు, గ్రామసర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ డా.రవినాయక్, వివిధ బ్యాంకుల అధికారులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

\- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు జాబితాపై శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో ఓటరు జాబితా సవరణ ఫారాలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. బీఎల్‌ఓల ద్వారా పకడ్బందిగా ఓటరు జాబితా ప్రాసెస్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు ఈ అంశంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహి స్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా స్వీకరిస్తున్న అన్ని రకాల ఫారాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఫాఆల పరిష్కారంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాసెస్ చేయని అన్ని ఫారాల ను తక్షణమే ప్రాసెస్ చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20,21 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లా కేంద్రంతో పాటు అన్ని స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు, ర్యాలీలు, ఉపన్యాసం, రంగోలి తదితర కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కుమార్ దీపక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**బాలానగర్,జనవరి 19 ప్రభాతవార్త:** ఏడుగుట్టల తండాలో బోడియనాయక్ కుమారుడు పాత్లావత్ చందర్‌నాయక్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నేనావత్ వీరేందర్ గోరిగడ్డ తండావాసి తనవంతు సాయంగా రూ. 10 వేలు నగదు చందర్‌నాయక్ భార్యకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడుగుట్టల తండా గ్రామ పంచాయతీ పాత్లావత్ శ్రీనునాయక్, రెడ్యానాయక్, పి. శ్రీను, కె.వెంకటరాంనాయక్, శివ, కేతావత్ శ్రీను, జరుపల వెంకట్‌నాయక్, జె. రమేష్‌నాయక్, కె. శ్రీనునాయక్, జె. దాసునాయక్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## మంత్రి, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

**బాలానగర్,జనవరి 19 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రం లో రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ మంత్రికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. మండలం కొల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి మంత్రి హైదరా బాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో బాలానగర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల కోరిక మేరకు ఆగి కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తలందరికి అభివాదం చేసి కొల్లూరు గ్రామానికి వెళ్లారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మె ల్యే రాజేష్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు దుష్యంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వ ర్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, బాబు నాయక్, రఫీక్, బోడ రాజంపేట యాదయ్య పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐ

**వనపర్తి ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐబి హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బి.హరి ప్రసాద్ మాట్లాడుతూ గురువారం రోజు రాత్రి దాదాపు 11 గంటల 30 నిమిషాలు సమయంలో పెద్దమందడి మండలంలోని మదిగట్ల గ్రామ శివారులో గల మహ్మదు హుస్సేన్ చెరువు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మూడు భారత్ బెంచ్ టిప్పర్లతో మట్టిని తరలిస్తుండగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. తదుపరి చర్య నిమిత్తం మైన్స్ అండ్ మినరల్స్ డిపార్ట్‌మెంట్స్‌కు అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనాఇసుకగాని మట్టిగాని అనుమతులు పొందకుండా అక్రమంగా తరలిస్తేచట్టరీత్యాతగుచర్యలుతీసుకోబడుననిఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

## భక్తులకు జెండాల పంపిణీ

**లింగాల,జనవరి19 ప్రభాతవార్త:** అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో బిజెపి మండలాధ్యక్షులు యాదగిరి సలేశ్వరం ఆధ్వర్యంలో భక్తులకు రాముని ఫొటోతో కూడిన జెండాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ జెండాలను అదే గ్రామానికి చెందినసదగొండ మల్లేష్ విక్రయించి, బిజెపి మండలాధ్యక్షులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య ప్రాణపత్రిష్ఠ పురస్కరించుకుని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తులసిరామ్, బాలరాజు, రేణ్యానాయక్, లింగమయ్య పాల్గొన్నారు.

## ఎర్రపెంట గ్రామాన్ని సందర్శించిన కర్ణాటక బృందం

**లింగాల,జనవరి 19 ప్రభాతవార్త: మండల** పరిధిలోని ఎర్రపెంట గ్రామాన్ని కర్ణాటక బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. చెంచులతో సమావేశం ఏర్పాటు చేసి అటవి హక్కుల చట్టం 2006 గురించి అడిగి తెలుసుకున్నారు. అడవిలో సేకరించే పదార్థాలు, అలా ఎలా విక్రయస్తున్నారు. చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యల కోసం చెంచులోకం, ఉడుందెబ్బ లాంటి కమిటీలు పని చేస్తున్నాయని చెంచులు వారికి తెలిపారు. గ్రామంలో నివసిస్తున్న వారికి ఇండ్ల నిర్మాణము చేయాలని ఐటిడిఎ అధికారులకు వినతులు ఇవ్వడంతో 100 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామానికి రోడ్డు, వాటర్ ట్యాంక్, అంగన్‌వాడి, స్కూల్ భవనాలు సాధించామని అన్నారు. కార్యక్రమంలో ఎర్రపెంట గ్రామ సర్పంచ్ అక్కమ్మ, సిడబ్ల్యుసి చైర్మన్ లక్ష్మణ్‌రావు, ఎఫ్‌ఆర్‌సి కమిటి చైర్మన్ గోవిందు, ఫౌండషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, కర్ణాటక బృందం సభ్యులు రత్నమ్మ, రజోబి, అప్పయ, ప్రకాష్, సురేష్, నాగరాజు, లోకేష్ ఉన్నారు.

## 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** 75వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో ఈ నెల 26న స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించే 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది ఆగస్టు 15న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులందరు సమన్వయంతో బాగా నిర్వహించారని, గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకల్లో అధికారులకు కేటాయించిన విధులు పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలనుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్,వాటర్ బాటిల్స్ అందించాలన్నారు.విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ముందుగానే తిలకించి ఎంపిక చేయాలని డీఈఓ గోవిందరాజులుఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కే.సీతారామారావు, ఏఓ డి.చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు,డి.ఎస్.పి.మోహన్‌కుమార్,మున్సిపల్‌కమిషనర్ జయంత్ కుమార్‌రెడ్డి,ఆర్డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

## కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండేను కలిసిన కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జనవరి 19 ప్రభాతవార్త:** కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు హజరైన సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ స్థానిక హిమాలయ హోటల్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికి అనంతరం కొద్దిసేపు ఆయనతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి మంత్రి మహేంద్రనాథ్ పాండే ఆరా తీయగా జిల్లాలో కేంద్ర పథకాల అమలు సమర్థవంతంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముద్ర తదితర రుణాల అమలును మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంత పంటల సాగులో ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులు అవలంభిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి సాగు ప్రధానమైనప్పటికి ఇతర మిశ్రమ పంటలను కూడా సాగు చేస్తారని వివరించారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీఓ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలం రాకొండ గ్రామ సర్పంచ్ నరేందర్‌గౌడ్‌ను అనారోగ్య రీత్య మహబూబ్ నగర్‌లోని శ్రీఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని నరేందర్‌గౌడ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి గ్రామ సర్పంచ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

## వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో జనవరి 15న నాగమ్మ (60) అనే వృద్ధురాలు మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో ఇద్దరు అనుమానితులు కల్వకుర్తికి చెందిన వరికుప్పల వెంకటేష్, తెల్కపల్లి మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన అలివేలు తచ్చాడుతూ కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించగా రెండు హత్యలకు సంబంధించిన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. వరికుప్పల వెంకటేష్ భార్య గత సంవత్సరం క్రితం ఆత్మహత్య చేసుకోగా, అలివేలు తన భర్తకు విడాకులు ఇచ్చి వీరిద్దరు పరిచయమై గత 4 నెలలుగా సహజీవనం చేస్తూ సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో జనవరి 15న కల్వకుర్తి పట్టణానికి చెందిన నాగమ్మను, బల్మూర్ మండలం బాలకిష్టమ్మ ఈ నెల 13 తేదీల్లో పట్టణ ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి వారిని హత్య చేసి వారి వద్ద ఉన్న బంగారు అభరణాలను తీసుకెళ్లి పరారైనట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.4లక్షలు విలువ చేసే బంగారం, వెండి వస్తువులు, కొంత మేర నగదును రీకవరి చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తున్నామని, కోర్టు అనుమతి తీసుకొని మరోసారి విచారణ చేపడుతామన్నారు. కేసును ఛేధించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ పార్థసారథి, వెల్దండ సీఐ సోమ నర్సయ్య, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

